# విప్లవకవితాధోరణులు - అన్నమయ్య కీర్తనలు

- సాయి బ్రహ్మానందం గొర్తి

కవిత్వ ప్రస్తావన వస్తే తెలుగులో అనేకమైన కవితా ప్రక్రియలున్నాయి. అంటే గేయకవిత్వం, పదకవిత్వం, పద్యకవిత్వం, గద్యకవిత్వం లేదా ఆధునిక కవిత్వం, ఇలా రకరకాల ప్రక్రియల ద్వారా తెలుగు సాహిత్యం విస్తరించింది. ఏకవిత్వమైనా అనుభూతి అనే వాహకం మీదే నిలుస్తుంది. సమాజంలో తన చుట్టూ ఉన్న ప్రపంచంలో తన అనుభవాలని అప్పటి పరిస్థితుల కనుగుణంగా వేరే కోణంలో చూపించే వాడే కవి. ఏ కవి లేదా రచయితయినా తను జీవించే కాలానికీ, సమాజానికీ అతీతంగా రచనలు చేయలేడు. ఇక్కడ కవి అనుభవాలంటే తన సొంత అనుభవాలే కాక, తన మిత్రుల లేదా సంఘంలోనున్న ఎవరి అనుభవాలైనా కావచ్చు. ఇది ఏ కవితారీతికైన ముఖ్యమైన అంశం. ఈ అనుభవాల్లోంచి పుట్టిన భావ చైతన్యమే కవిత్వం. ఈ భావం అనేక రకాలుగా ఉంటుంది. అది భక్తికావచ్చు, శృంగారం కావచ్చు, స్తోత్రం కావచ్చు, ప్రకృతి వర్ణన కావచ్చు. ఏదైనా అది సూటిగా ఇతరుల హృదయాల్ని తాకాలి. కేవలం తాకడమే కాదు, అక్కడ కాస్త అలజడి పుట్టించాలి. ఆలోచన రేపాలి. భావ విప్లవం పుట్టించాలి. అప్పుడే ఆకవిత్వం కలకాలం నిలుస్తుంది.

తెలుగులో అనేక కవితారీతులున్నా, పద కవిత్వాన్నికొక ప్రత్యేకతుంది. కవిత్వాన్ని సంగీతంలో బంధించి పదిమందిచేతా పలికించేలా చేయిస్తుందీ పదకవిత్వం. తెలుగులో పదకవిత్వం అనగానే మనకి అప్రయత్నంగా మదిలో మెదిలే రూపం తాళ్ళపాక అన్నమాచార్యులదే!

అలాగే అన్నమాచార్యుడు పేరు చెప్పగానే మనకి ముందు స్ఫురించేవి ఆయన రచించిన పద సంకీర్తనలు. అన్నమాచార్యుల కవితాధార ప్రధానంగా భక్తిపరంగా సాగుతుంది. అంటే ఆధ్యాత్మికత నిండి భక్తిభావన వెదజల్లే గీతాలే ఈ పద సంకీర్తనలు. ఈ కీర్తనల భావ ప్రాధాన్యతని దృష్టిలో వుంచుకొని, వీటినిఆధ్యాత్మిక కీర్తనలుగానూ, శృంగారకీర్తనలుగానూ విభజించారు. అన్నమాచార్యులు కొన్ని వేల ఆధ్యాత్మిక సంకీర్తనలూ, శృంగార కీర్తనలూ రాగయుక్తంగా, అనేక రాగాలలో స్వర పరిచాడు.

ఇంతకు ముందు ప్రస్తావించినట్లుగా కవి తన చుట్టు జరిగిన సంఘటనలు లేదా పరిస్థితులకే స్పందించి తన మనోభావానికి ఒక రకమైన ప్రత్యేక రూపకల్పన చేస్తాడు.

ఈ రకమైన రూపకల్పనకి ఆర్జవ గుణం ప్రాధాన్యంగా ఉంటుంది. ఆర్జవం అంటే తాను అనుభవించిన భావాలను మాత్రమే వెలువరించే అకృతిమమైన స్వభావం. (అంటే ధనార్జనకో, ఇతరుల మెప్పుకో, లేదా సమాజ పరిరక్షణే ధ్యేయంగా తన మనస్సులో నిజంగా లేని భావాలను తన స్వంతభావాలుగా ఆపాదించుకొని రచనా వ్యాపకం సాగించడం.) ఈ రకమైన ఆర్జవ గుణం కలిగిన కవిత్వానికి పదునైన భాషా, భావాలకు తీవ్రతా జోడిస్తే, ఆ రచన కలకాలం నిలిచిపోతుంది. అన్నమయ్య ఈ ఆర్జవ గుణమే ఊపిరిగా జీవించి పద కవిత్వ రచనలు చేసాడు. ఆధునిక పరిభాషలో ఆర్జవం అంటే విప్లవమనే అర్థం చేసుకోవాలి. ఇక్కడ విప్లవమంటే తన చుట్టూ జరిగే అన్యాయాలనీ ఖండిస్తూ, తన వ్యక్తిత్వాన్ని నిలుపుకుంటూ, ఎవరికీ భయపడక తనకి తప్పు అనిపించిన దాన్ని నిర్భయంగా చెప్పడమేయని గ్రహించుకోవాలి.

తన్ను పూజించి, మెప్పు చూపించిన ప్రభువులపై కవిత్వం రాయడానికి తిరస్కరించి, చెరసాల పాలయ్యాడు పదకవితాపితా మహుడు అన్నమయ్య. ఈ సందర్భంలోనే "హరి ముకుందుడని గొనియాడు" కీర్తన రచించాడు. పరమాత్ముని స్తుతించిన నోటితో పరులను స్తుతించలేనని నిర్భయంగా చెప్పాడు. కష్టాలు కొని తెచ్చుకున్నాడు. అయినా తను నమ్మిన సిద్ధాంతాన్ని దాటలేదు. ఇలా తన మనో వ్యతిరేకతని నిర్భయంగా చాటి చెప్పిన మహాకవి అన్నమయ్య. అంతే కాదు - తన కవితారీతిననుసరించి తన లాగా రచనలు చేసిన కవులను కూడ దుయ్యబట్టాడు. అంటే ఆ రోజుల్లో కూడా భావచౌర్యం విస్తృతంగానే ఉండేదని తెలుస్తోంది. ఈ సందర్భంగా తననుసరించి తనలాగే కీర్తనలు రచించిన వారిని సుతిమెత్తగా గర్హించాడు అన్నమయ్య.

వెఱ్ఱులా మీకు వేడుకగెలితేను
అఱ్ఱువంచి తడుకల్లంగరాదా

అంటూ పల్లవిలోనే తన నిరసన చూపాడు. ఇంకా -

ముడుచివేసిన పువ్వు ముడువ యోగ్యము గాదు
కుడిచి వేసిన పుల్లె కుడువగా గాదు

ఒకరి కొప్పులో సింగారించబడిన పువ్వు మరొకరి తలకి అలంకరించడం సంస్కార హీనమంటాడు. మరో చరణంలో

ఉల్లి దిన్న కోమటూరక ఉన్నట్టు

జల్లెడనావాలు జారిపోయినట్టు

కల్లలు చెప్పి యాకతకుత్తరములీక

మొల్లనే ఉండితే మెచ్చునా దైవము.

"నోరు మూసుకున్నంత మాత్రాన ఉల్లి తిన్న వాసన పోతుందా? జల్లెడలో ఆవాలు జారినంత సులభంగా అందరికీ తేట తెల్లమువుతూనే వుంటుంది. అసత్యాలు చెబితే పరుల శ్రమా కవిత్వమూ మనదవుతాయా?" అంటూ ప్రశ్నిస్తాడు. ఇంకో చరణంలో -

చిబికివేసిన గింజ చేత బట్టగనేల

గబుక కెంగిలి బూరె గడుగగ మరి యేల

తొబుక కవిత్వాల దోషాల బొరలితే

దిబుకార నవ్వడా దేవుడైనాను.

"ఒకరు తినిపారేసిన గింజలేరు కోవడమెందుకు? ఎంగిలైన బూరెను కడిగితే ఎంగిలి పోతుందా?" అంటూ అస్త్రాలు సంధిస్తాడు. ఈ రకంగా పది చరణాలు పైగా సాగిన ఈ కీర్తనలో భావ చౌర్యం ఎంత హేయమైన పనో, ఎంత నీచమైనదో కవిత్వీకరిస్తాడు అన్నమయ్య. ఇటువంటి రచనా చమత్కృతి చూస్తే కవిగా అన్నమయ్యలోని ఆర్జవ గుణం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

అలాగే కులజాతి వివక్షతని కూడా అన్నమయ్య వ్యతిరేకించాడు. అది

ఏకులజుడేమి ఎవ్వడైన నేమి

ఆకడ నతడే హరి నెరిగినవాడు

అని ఒక కీర్తనలోనూ -

విజాతులాన్నియు వృథా వృథా

అజామిళాదుల కదియే జాతి

జాతిభేదములు శరీర గుణములు

జాతి శరీరము సరి దోడనే చెడు

అతుమ పరిశుద్ధం బెప్పుడును అది నిర్దోషంబనాది

ఈతల హరి విజ్ఞానపు దాస్యం బిది యొక్కటెపో సుజాతి.

"జాతి బేధాలు శరీర సంబంధమైనవే కానీ ఆత్మ సంబంధమైనవి కావు. ఆత్మ పరిశుద్ధమైనది. దానికి దోషం లేదు. అటువంటప్పుడు ఈ కులాలూ, జాతులూ అంటూ వివక్షత ఎందుకు?" అంటూ సంఘాన్ని నిలదీస్తాడు. ఈ కీర్తనలో అప్పటి సామాజిక పరిస్థితుల్నీ, కులతత్వాన్నీ వివరిస్తూ, అవి ఎంత చెడు ప్రభావాన్ని కలిగిస్తాయో చెబుతాడు.

అలాగే క్రీ.శ. 1435 - 1445 ప్రాంతములలో జరిగిన తురుష్కుల దౌర్జన్యాన్ని చూసి చలించి పోతాడు అన్నమయ్యలోని కవి. ఆబాధనీ, స్పందన్నీ ఓ కీర్తనలో ఇలా వివరిస్తాడు.

తుటుములై భూసురల తుండెములు మొండెములు

యిటువలె భూతములు యెట్టు మోచెనో

అటు బాలుల రొదలు ఆకాశ మెటులోరిచెనో

కటకటా యిట్లాయ గలికాల మహిమ రా

తురుష్కుల దౌర్జన్యకాండ ఎంత తీవ్రంగా జరిగిందో మొత్తం తొమ్మిది చరణాలలో వివరిస్తాడు. తన చుట్టూ జరిగే అన్యాయాలను, అక్రమాలను నిర్భయంగా ఖండించి, ఆ భావ ప్రకటనలో విప్లవ కవిత్వ ధోరణి కూడా ప్రవేశ పెట్టిన వాడు అన్నమయ్య. ఈ రకంగా చూస్తే - అన్నమయ్య సహజసిద్ధమైన ఆర్జవ కవి. తన ప్రాణాలకు ముప్పు వచ్చినా సరే తను నమ్మినది, తనకు అన్యాయమనిపించిది నిర్భయంగా చెప్పిన మహాకవి అన్నమయ్య.

ఇటువంటి కీర్తనలన్ని చూస్తే - ఆధ్యాత్మికత నిండిన ఓ భక్తుడి గానో లేదా, ఓ శృంగార కవిగానో కాకుండా ఓ విప్లవాత్మకమైన వ్యక్తిగా కూడా అన్నమయ్య కనిపిస్తాడు. తను స్పందించిన ఏ విషయాన్నైన నిర్భయంగానే ప్రకటించాడు. ఈ రకంగా విప్లవకవిత్వానికి నాందీ ప్రస్తావన చేసాడన్నమయ్య.

జాతి కుల బేధాలు లేకుండా, మానవులంతా సమానమేనన్న ధోరణి అన్నమయ్య కీర్తనల్లో స్ఫురిస్తుంది. అతి ప్రసిద్ధమైన "తందనానా అహి తందనానా భళా!" కీర్తనలో ఈ రకమైన విప్లవాత్మకమైన ధోరణి కనిపిస్తుంది. అలాగే అప్పటి కాలంలో రాజ్యాధికారం కోసం తమ స్వంత బంధువుల్నీ, తల్లితండ్రుల్నీ, అన్నదమ్ముల్నీ హతమార్చే రాజకీయ ధోరణ్ణి కూడా అన్నమయ్య బాహాటంగా ఖండించాడు.

వెరకు వెఱకు నిందిసేడుకపడ నిట్టి -

కురుచ బుద్ధుల నెట్టు గూడుదువయ్యా?

దేహమిచ్చిన వాని దివిరి చంపెడివాడు

ద్రోహిగాక నేడు దొరయటా

అహికముగా నట్టి అథమవృత్తికి నే

సాహసమన నెట్టు చాలుదునయ్యా?

తోడబుట్టినవాని తొడరి చంపెడువాడు

చూడ దుష్టుడు గాక సుకృతియట

పాడైన యిటువంటి పాపబుద్ధులు వేసి

నీడ నిలువ నెట్టు నేరుతునయ్యా?

అలాగే ఇంకో చరణంలో "తల్లి జంపెడివాడు తలప దుష్టుడుగాక" అంటూ అతి తీవ్ర పదజాలంతో దూషిస్తాడు.

గజపతులు విజయనగరంపై దండెత్తి వచ్చినప్పుడు ఆ యుద్ధ ప్రభావాన్ని కళ్ళారా చూసాడన్నమయ్య. గజపతులు విజయనగరం ఆక్రమించుకున్నారు. రాజులు మారినప్పుడల్లా భాషకూడా మారేది అప్పట్లో! గజపతుల భాష వడ్డె భాష. అంతవరకూ తెలుగు భాషనే మాతృభాషగా పరిగణించే ప్రజలకి వడ్డె భాష ఎక్కలేదు. బలవంతంగా నేర్చుకోవాల్సి వచ్చింది. భాషని ప్రజలపై రుద్దడం ఇష్టం లేక ఈ క్రింది కీర్తన ఉటంకించాడు.

అన్నియు నా యందె కంటి నన్నటి వాడా నేనే

మున్నె నా భావముతో ముడివేసినది.

వాడ వాడలా నేనూ, నాకీర్తనలూ ఉన్నామనే భావనుండేది. ఈ వడ్డె భాషొచ్చాక నా భావము తప్పనిపిస్తోంది అంటూ వాపోయాడు.

నొగి నొడ్డె భాష లాది వొడ్డెవాడనైతి

తెగి తెలుగాడ నేర్చి తెలుగువాడనైతి

అగడై శ్రీ వేంకటేశ అన్నియు విడిచి నేను

తగు నీ దాసుడనై దాసరి నేనైతి.

బలవంతాన ఒడ్డే భాష నేర్చుంకుంటూ ఒడ్డె వాడనయ్యాను. తేట తెనుగునవపోసన పట్టి తెలుగువాడనయ్యాను కదా అంటూ ఆక్రోశించాడు.

మనిషై పుట్టాక కష్టపడాలి. సోమరి తనానికి దూరంగా బ్రతకాలి. "ఉద్యోగం పురుష లక్షణం" అన్న సామెత ఎప్పుడు పుట్టిందో తెలియదు కానీ. "ఉద్యోగం మానవ లక్షణం" అంటూ ఎలుగెత్తి చాటాడు అన్నమయ్య.

మహినుద్యోగి గావలె మనుజుడైనవాడు

సహజి వలె నుండేమి సాధింప లేడు.

ఈ విధంగా తన ముందున్న సమస్యల్నీ, జాడ్యాలనీ, దురాచారాల్నీ ఖండించాడు.

ఈ రకమైన కవితా ధోరణులు చూస్తే - అన్నమయ్యలో భావ కవే కాదు, శృంగార కవే కాదు, ఓ విప్లవ కవి కూడా కనిపిస్తాడు. ఆధ్యాత్మికత పండితే వచ్చేది మానసిక విప్లవమే నని అన్నమయ్య పదాలు మరో సారి స్పష్టం చేస్తాయి. ఈ రకంగా ఆర్జవ కవిగా అన్నమయ్య చిరస్మరణీయుడు. తన కవిత్వంలో విప్లవ భావకిరణాలను ప్రసరించిన పద కవితా భాస్కరుడు.

(ఈమాట సౌజన్యంతో)